# 17. సప్తపది

"ఈ వర్షం వదలకుండా తినేస్తుంది." అన్నాడు అమర్ పాట్‌లోని టీ కప్పులోకి పోస్తూ.

బయట వర్షం నిలకడగాకురుస్తోంది. రెస్టుహౌసు ఆవరణలోనున్నపొడుగాటి టేకు చెట్ల ఆకులమీద చినుకుల చప్పుడు మద్దెలమీద సున్నితమైన దరువుల్లా వినిపిస్తున్నాది.

"వర్షం కన్న అన్యాయంగాఉంది ఇక్కడి తిండి- ఈ బేరరుపెట్టేపప్పు, రొట్టెలు తినడంకన్న వేరేశిక్ష అక్కరలేదు"

"నాకు బాగున్నాయి. నాకు భోజనంమీద అంతవ్యామోహం లేదు. ఏదోతిని, వెచ్చగా రగ్గు కప్పుకొని, పుస్తకం చదువుతుంటే లోకమే మరచిపోతున్నాను." అన్నాడు మూర్తి.

"ఊహల్లో విహరించే వాళ్లతీరే ఇది."

"నీకు భోజనం మీద అంతమక్కువైతే, ఈరాత్రికి జీపిస్తాను. పోయి మస్తుగా హొటల్లో తినిరాకూడదూ?"

"అందమైన ఆడది వడ్డిస్తూ ఉంటే, మాటా మంతీ చెప్పుకుంటూ భోజనంచేయాలి. బోడిగా గోడలకేసి, వాటి మీద పాకే బల్లులకేసి చూస్తూ.. చేసే భోజనం ఏంబాగుంటుంది?"

"అదాసంగతి!" మూర్తినవ్వాడు.

"మూర్తీ! ఎన్నాళ్లిలా ఒంటరిగా ఉంటావు?" కొంచెం సీరియస్‌గా అన్నాడు అమర్.

"మంచి భార్యదొరికే వరకు"

"మీ అమ్మ గారు ఎలా ఊరుకున్నారయ్యా?"

"ఆమె ఊరుకుందా? ఏదో సాకు చెప్పి వెనక్కుపెట్టాను."

"కోడలు సరిగా ముసలామెను చూడదని భయపడ్డావా?"

"అది నిజమే!"

"మీ అమ్మగారు పోయి ఒక సంవత్సరం దాటిపోయింది. మరి నీ ఆటంకమేమిటి?"

"సరియైన ఆమె దొరకొద్దూ!"

అమర్ మరిమాట్లాడలేదు. బట్టలు వేసుకొని హాలులోకి వచ్చాడు. మూర్తి జోళ్లు తొడుక్కున్నాడు. బయట వర్షంలో జీపు నిలబడి ఉంది. బేరరు కప్పులు, ప్లేట్లు తీసి వేశాడు.

"చెప్పడం మరచిపోయాను, ఇక్కడో ఎలిమెంటరీ స్కూలు ఉంది. ఇన్స్పెక్షన్ బాకీ ఉంది. స్కూలు గోడలు పగుళ్లు వేశాయని, కప్పునుండి వాన నీరు కారుతున్నదని' రిపోర్టులు వచ్చాయి. పద చూపిస్తాను." అన్నాడు అమర్.

కాలనీ చివర ఒక చిన్నలైబ్రరీ, దానిని అంటుకొని ఎలిమెంటరీ స్కూలు ఉన్నాయి. స్కూలు ఎనిమిది గంటలకు తెరిచారు. జీపు గేటుదగ్గిర ఆగేసరికి హెడ్ మిస్ట్రెస్ గొడుగుముడిచి లోపలికి వెళ్తున్నది.

ఇద్దరు ఆఫీసర్లు స్కూలులోకి ప్రవేశించారు. లోపల బెంచీలన్నీ కాళీగా ఉన్నాయి. అది పెద్ద హాలు-తరగతుల కోసం వేరే గదులులేవు. మధ్యను అడ్డుకూడాలేవు. అక్కడ మగ మాస్టారులు ఒకరూ కనిపించలేదు మూర్తికి. ఉన్న అయిదుగురూ ఆడవాళ్లే.

వచ్చిన అధికార్లను చూసి మాస్టరమ్మలు సంభాషణ ఆపి నిలబడ్డారు. హెడ్‌మిస్ట్రెస్ ముందుకొచ్చింది.

"ఈమె కుంజలత,! హెడ్‌మిస్ట్రెస్ ! ఈయన మధుమూర్తి. డివిజనల్ ఇంజనీరు. కొత్తగా బదిలీ అయివచ్చారు" మూర్తిని పరిచయం చేశాడు అమర్.

నమస్కారాలయిన తరువాత అధికారులిద్దరూ కుర్చీలమీద కూర్చున్నారు. మాస్టరమ్మలు చేతులు కట్టుకొని నిలుచున్నారు.

" ఈరోజు ఇనస్పెక్షనని మీకు ఉత్తరం పంపించాను.అందిందా?" అమర్ ప్రశ్నించాడు.

"అందింది" అంది కుంజలత.

"మరి పిల్లలేరి?"

"మీరు చాల మంచి సమయం చూసి ఇనస్పెక్షనుకు వచ్చారు. ఈ వర్షంలో తడుసుకుంటూ కారుతున్న ఈ బడికి ఏ పిల్లలొస్తారు? మీ ఉత్తరం అందింది కాబట్టి మేము వచ్చాం. లేకపోతే మేం కూడా వచ్చేవాళ్లంకాదు".

కుంజలత చనువుగా అమర్‌తో మాట్లాడింది. తరువాత టీచర్లను పరిచయం చేసింది మధుమూర్తికి.

నళిని, మేరి, మాలతి, మాళవిక - అన్నీ చక్కని పేర్లు- పూల పేర్లలా పరిమళిస్తున్నవి. మధ్యవయసు దాటిన వాళ్లెవరూ లేరు.

అంతమంది అందమైన ఆడవాళ్ల మధ్య మూర్తి స్వేచ్ఛగా మాట్లాడలేకపోయాడు. అమర్ మాత్రం చొరవతీసుకొని మాట్లాడుతున్నాడు. రిజిస్టరు చూసి సంతకం చేశాడు.

బిల్డింగ్ ఎక్కడెక్కడ కారుతున్నదో మూర్తికి చూపించింది కుంజలత. అప్పటికప్పుడే పదిదాటిపోయింది. అధికార్లిద్దరూ లేచారు వెళ్ళిపోడానికి.

" మీ ముఖాలు చూస్తుంటే తిన్నగా భోజనం చేసినట్లు కూడా కనిపించదు. రాత్రి

మాయింటికి రండి", ఇద్దరినీ ఆహ్వానించింది కుంజలత.

"ఇద్దరమూ మీయింటికిరాం, నేను ఒకరింటికి అతను మరొకరింటికి. ఎప్పుడూ హెడ్‌మిస్ట్రెస్ యింటికి భోజనానికి వెళ్లడం నాకు నచ్చలేదు" అన్నాడు అమర్.

"మీకు నచ్చిన టీచరింటికి మీరు వెళ్లవచ్చు. వాళ్లందరి తరఫున నేను ఆహ్వానిస్తున్నాను. మరేం అభ్యంతరం లేదు." అంది కుంజలత.

"నాకొక్కటే అభ్యంతరం- నేను శాకాహారిని" అన్నాడు మూర్తి.

"ముగ్గురం మాంసాహారులం- ఇద్దరు శాకాహారులు- అయితేనేం అందరి యిళ్లలోను శాఖాహారం లభిస్తుంది.-" అంది కుంజలత.

"చీట్లు వెయ్యండి. మాంసాహారియింటికి నేను శాఖాహారి యింటికి మూర్తి."

కుంజలత నవ్వింది తన ఉపాధ్యాయినులను చూసి. ఆమె చూపులు మాలతిమీద నిలిచాయి. తరువాత ఆమె చీట్లు వ్రాసింది, మాళవిక తీసింది.

మాలతి పేరు, కుంజలత పేరు వచ్చాయి. మూర్తి మాలతి యింటికి అమర్ కుంజలత యింటికి వెళ్లడానికి నిర్ణయమయింది.

సాయంకాలం కూడా వర్షం తగ్గలేదు.

అమర్ అనుకోకుండా హెడ్‌క్వార్టర్సుకి మరలిపోవలసివచ్చింది. రైలులో వెళ్లిపోతూ అతను మూర్తితో అన్నాడు.

"రాత్రి మాలతి గారింటికి భోజనానికి వెళ్లడం మరచిపోకు. నాకు అదృష్టంలేదు."

"నాకు కూడా వెళ్లాలనిలేదు. భోజన ప్రియుడివి నువ్వు. నిజం చెప్పాలంటే తెలియని కుటుంబాలతో భోజనం చేయడం నాకు నచ్చదు."

"మూర్తీ! ఈ మారుమూలనున్న ఉద్యోగులతో సంబంధాలు మెరుగు పరుచుకోవాలంటే ఇటువంటి మార్పు అవసరమనిపిస్తుంది. కుంజలత మధ్యాహ్నంకూడా కబురు పెట్టింది. వెళ్లడం మానివేయకు. వాళ్లందరూ స్కూలులో మన కోసం ఎదురు చూస్తూఉంటారు."

రైలు వెళ్లిపోయింది. రెస్టుహౌసు స్టేషను దగ్గరేఉంది. బట్టలు మార్చుకొని, ఎటాచీలో పంచ, తువాలు పెట్టుకొని జీపు మీద మూర్తి స్కూలుకి వెళ్లాడు.

కాలనీకి మైలు దూరంలో ఊరుంది.

మూర్తి కోసం వాళ్లు ఎదురు చూస్తున్నారు.

"మాలతి యిల్లు మీకు తెలీదు. ఆమెను తీసుకొని మీరు జీపు మీద వెళ్లిపొండి. మామూనాన్న మేము వెళ్లిపోతాం ". అంది కుంజలత.

"మిమ్మల్ని వర్షంలో ఇళ్లకు నడిపించి నేను జీపుమీద పోవడం భావ్యం కాదు. అందరం కలిసి వెళ్లిపోదాం."

కుంజలత డ్రైవ్‌చేస్తున్న మూర్తి పక్కను కూర్చుంది. ఆమె పక్కను నళిని, మాలతి కూర్చున్నారు. మిగిలిన వాళ్లు వెనుకసీట్లలో కూర్చున్నారు. ఊళ్లో మాలతి యిల్లు మద్రాసీ హొటల్ వెనుక వీథిలో ఉంది.

ముందు వీథులలో ముగ్గురు మాస్టరమ్మలు దిగిపోయారు. తరువాత కుంజలత యిల్లు చేరుకున్నారు.

"ధన్యవాదాలు మూర్తిగారు! సాయంకాలం వచ్చిన అతిథిని పంపివేయకు మాలతి! ఈ వర్షంలో ఈదరిగాలిలో అతనిని ఇబ్బందిపెట్టకు."

తరువాత మాలతి యింటివేపు జీపు తిరిగింది.

పెద్ద ఆవరణ. అందులో అయిదు పోర్షన్లు. చివరది మాలతిది.

మాలతి, యి ంటి తలుపు తాళం తీస్తున్నప్పుడు అర్థమయింది మూర్తికి, ఆమె వంటరిగా ఉన్నదని.

వీథి గడపదగ్గిరే నిలబడిపోయాడుమూర్తి.

మాలతి దీపం వెలిగించింది. వీథి వరండాలో మంచి వెల్తురు వచ్చింది.

"లోపలికిరండి!"

మాలతి తెలుగులో మాట్లాడింది. అంతవరకూ అందరూ హిందీలోనే మాట్లాడుతున్నా, ఆమె, ఒక్కసారి తెలుగులో మాట్లాడడంతో అతనికి ఆశ్చర్యం వేసింది.

"క్షమించండి! మీరు తెలుగువాళ్లని నాకు తెలీదు. మధ్యప్రదేశ్‌లో బస్తరు జిల్లాలో మారుమూలనున్న పట్నంలో తెలుగు టీచర్లుంటారని నేననుకోలేదు. మీకు శ్రమ కలిగించడం నా అభిమతం కాదు".

"మీరు వర్షంలోనే నిలబడిపోయారు. ముందు లోనికి రండి. తరువాత మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం. వీథిలోంచే వెళ్లిపోతాననడం భావ్యం కాదు."

వరండాలో వానకోటు, జోళ్లు విడిచి, మెత్తామీద కాళ్లు బాగా దులుపుకొని గదిలోకి ప్రవేశించాడు మూర్తి. గది విశాలంగా ఉంది. ఒక పక్కను మంచం, దాని మీద పరుపు, తెల్లటి దుప్పటీ పరచి ఉన్నాయి. ఒకవేపు మంచానికి కొంచెం దూరంలో టేబిలు, కుర్చీ, టేబిలుమీద కొన్ని పుస్తకాలు, రీడింగులైటు ఉన్నాయి. మీదనొక ట్యూబు వెలుగుతోంది. ఒక చిన్న బీరువా కూడా ఉంది.

గోడకు చేరబెట్టిన వాలుకుర్చీ మంచానికి దగ్గిరగా వాల్చి మూర్తికి ఆసనం చూపించింది మాలతి.

మౌనంగా కూర్చున్నాడతడు.

మాలతి వంటగదిలోకిపోయి స్టౌ వెలిగించి కాఫీచేసి పట్టుకొచ్చింది. చిన్న బల్ల ముందుకీడ్చి

దానిమీద కాఫీకప్పు ఉంచింది. డబ్బాతీసి బిస్కత్తులోనాలుగు ప్లేటులో పెట్టింది ఎదురుగా.

తనుకూడా టేబిలు తగ్గిర  కుర్చీలో అతనికి కొంచెం దూరంలో కూర్చుంది.

"మా అమ్మ నాతో ఎప్పుడూ ఉంటుంది. నెల్లాళ్ల క్రింద ఆవిడ మా అన్నయ్య దగ్గిరకి విజయనగరం వెళ్లింది. ఆమె ఈ సరికి రావలసిందే. ఇవాళే ఉత్తరం వచ్చింది, ఆరోగ్యం బాగులేదని, వచ్చేసరికి మరో వారంరోజులవుతుందని" అంది మాలతి.

"నాకీ విషయం తెలీదు. మీరు ఒంటరిగా ఉంటున్నారంటే ఏదో సాకు చెప్పి తప్పించుకునేవాడిని. మీ కుంజలత మాటవాసికి అన్నా నేను ఒప్పుకునేవాడిని కాను."

"ఆవిడకు అన్నీ తెలుసు. శాకాహారుల చీట్లటో నాఒక్కపేరు, మాంసాహారుల చీట్లలో తన పేరు రాసుకుంది. ఏచీటీతీసినా మూర్తిగారు మాయింటికి, అమర్ కుంజలత యింటికి భోజనానికి వెళ్తారు".

"అదా సంగతి"!

"ఈ విషయం కూడా ఆవిడే చెప్పింది. మీరు తెలుగువాళ్లని, అందుచేత సాంబారు అవీ చేసిపెట్టమంది. మరొకరి ఇంట్లో అయితే భోజనం బాగుండదని ఆమె అంది."

"మిమ్మల్ని ఇబ్బందిపెట్టదలచుకోలేదు. ఇక నేను వెళ్లిపోవచ్చా?" కాఫీకప్పు సాసరులో పెట్టి మూర్తి నిలుచున్నాడు.

"ఇటువంటి పరిస్థితి ఎదురవుతుందని, నేను ఈ పందెంలో ఓడిపోతానని మా వాళ్లందరూ ముందే చెప్పారు. మీరుకూడా వాళ్లపక్షమయితే నేనేం చేసేది?"

లేచిన వాడు మళ్లాకూర్చున్నాడు మూర్తి. దగ్గిరగా వేసిన వీధి తలుపును తెరుచుకొని ఒక్కసారి గదిలోకి చల్లగాలి వచ్చింది. ఆమె వెళ్లి తలుపు గడియపెట్టి వచ్చింది.

"బాత్‌రూంలో సబ్బూ, నీళ్లూ ఉన్నాయి. మీరు కాళ్లు చేతులు కుడుక్కొని విశ్రాంతి తీసుకొండి. టేబిలుమీద తెలుగునవలలు పత్రికలు ఉన్నాయి. రేడియో ట్యూన్‌చేసుకొండి. అభ్యంతరం లేకపోతే ఈమంచంమీద నడుము వాల్చండి."

అతను కాళ్లుకుడుక్కొని బట్టలు మార్చుకొని వచ్చాడు. ఆమె వంటపనిలో నిమగ్నురాలైంది.

ఇల్లు చిన్నదైనా చాల శుభ్రంగా ఉంది.

కొంచెం సేపు అతను టేబిలు మీదనున్న పుస్తకాలు తిరగేసి ఏమీతోచక మంచంమీద నడుంవాల్చాడు. రోజల్లా వానలో తిరిగి అలసిపోయాడేమో, వెచ్చని పక్కమీద పడుక్కోగానే కళ్లు మూతలుపడ్డాయి.

అతనికి తెలివచ్చి, లేచి మంచంమీద కూర్చున్నాడు. పప్పుపులుసు వాసనలు వస్తున్నాయి. కొద్దిదూరంలో కంచాలు ఇద్దరికీ అమర్చి, పీటలువేసి, భోజనానికి ఏర్పాటులన్నీ పూర్తిచేసిందామె.

టేబిలు దగ్గిర కూర్చొని పత్రిక ఏదో చదువుకుంటున్నది.

ఆమెను చూచాడు మూర్తి. మడతవిప్పిన జరీఅంచు తెల్లచీర కట్టుకుంది. చిన్నచుక్కలున్న తెల్లని జాకెట్టు తొడుక్కుంది. జడవేసుకొని, అప్పుడే కోసి తెచ్చిన మల్లెపూవులా స్వచ్ఛంగా ఉంది.

అతను లేవడం చూసి పుస్తకం పక్కకు పెట్టింది.

"వంట అయిపోయింది. మిమ్మల్ని ఎలా లేపడమా అని ఆలోచిస్తుంటే మీరే లేచారు. చాల ఆకలితో ఉన్నట్లున్నారు. ఇప్పటికే ఆలస్యమయింది. భోజనానికి రండి".

అతను బాత్‌రూములోకి వెళ్లి ముఖం కడుక్కొని వచ్చాడు. ఈలోగా ఆమె కంచాలలో వడ్డించింది. బంగాళాదుంపలు వేపుడు, పప్పుపులుసు, ఆవకాయ, అప్పడాలు- అన్నీ చిన్న పళ్లాలలో ఉంచింది.

అతను పీటమీద కూర్చున్నాడు. ఆమె అతనికెదురుగా కూర్చొని,వేడిగానున్న అన్నంమీద ఘుమఘుమలాడుతున్న నేయి వేసింది.

"మీరు కూడా వడ్డించుకొండి" అన్నాడు మూర్తి.

"మీకు వడ్డన సరిగా అవదు. తరువాత భోజనం చేస్తాను" అంది ఆవిడ.

"లేదు లేదు. మీరు కూడా వడ్డించుకోవాలి. లేకపోతే నాకు తిన్నట్లే ఉండదు."

ఆవిడ కూడా వడ్డించుకుంది.

"నేను అలాగే అనుకున్నాను, మీరు ఒంటరిగా భోజనం చెయ్యలేరు. మీ ఆవిడతో కలిసి తినడం మీకు అలవాలు". అంది మాలతి.

మూర్తి ఆశ్చర్యంతో ఆమె కళ్లల్లోకి చూశాడు.

"చక్కని ఆవిడ ముఖం చూస్తూ, తీయని ఆవిడమాటలు వింటూ భోజనం చేస్తే కడుపునిండుతుంది మీకు".

మూర్తికి సిగ్గనిపించి ముఖం దించుకున్నాడు.

"మీ వాలకమే చెప్తున్నది, పిల్లలకోసం బెంగపెట్టుకున్నారు".

ఇనుమడించిన ఆశ్చర్యంతో ఆమెకేసి చూశాడు.

"నా అంచనా ప్రకారం అమ్మాయే పెద్దదయి ఉంటుంది. రమారమి పదేళ్లుంటాయి. తండ్రిలా చక్కగా ఉంటుంది. కలిగిన వారింట్లో పుట్టిన పిల్లలకేంలోటు? కాన్వెంటులో చదువుకుంటుంది. సంగీతం కూడా--"

మూర్తికి ఏమీ తోచడం లేదు. కప్పులోని పాయసం చప్పరించడం మొదలు పెట్టాడు.

"అరెరే! మీరు మాటల్లోపడి భోజనం సరిగా చేయడం లేదు! పులుసెలా ఉంది? మరో

అప్పడంవేస్తున్నా. పాయసంలో తీపిసరిపోయిందా?''

మూర్తి తలదించుకొని భోజనం మీద శ్రద్ధ వహించాడు.

మాలతి కూడా మాట్లాడకుండా భోజనం కొంతవరకు చేసింది. ఇంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు సంభాషణ తిరిగి ప్రారంభించింది.

"వర్ణాలయికృతులలోకి వచ్చిందనుకుంటాను''. మూర్తి చిన్నగా నవ్వాడు.

"--- భరతనాట్యంకూడా చెప్పిస్తున్నారా?... పట్టణాల్లో ఉండేవారికి ఇటువంటి సదుపాయాలన్నీ ఉంటాయి.''

మూర్తి వింటున్నాడు.

"అబ్బాయి కిండర్ గార్టెన్ అయి మొదటి తరగతికివచ్చి ఉంటాడు... వాళ్లమ్మలాగా అందంగా, ఉంగరాల జుత్తుతో,.. అప్పుడప్పుడు మారాం చేస్తూ...''

మూర్తి భోజనం అయిపోవచ్చింది. ఆమె మూడోసారి అతని కప్పు నింపింది పాయసంతో.

"అనురాగవతియైన భార్యను, ముద్దొచ్చే పిల్లల్ని విడిచి ఉండడం కష్టమే.. అందులో మీవంటి వారికి మరీను--''

కంచంలో చేయి కడుక్కొని ఆమె వంక నవ్వుతూ చూశాడు. ఇంకా తన సంసారం గురించి ఆమె చెప్పవలసింది ఉంటే విందామని సావకాశంగా కూర్చున్నాడు. కాని, ఆమె మరేం మాట్లాడకుండా భోజనం ముగించింది.

గదిలోని కంచాలు, పాత్రలు ఆమె తీసివేస్తుంటే అతను బట్టలు వేసుకోడానికి సిద్ధమయ్యాడు.

"అప్పుడే తొందరేముంది? ఇంకా పది గంటలు కూడా కాలేదు. ఏమీ మాట్లాడినట్లేలేదు. బయట వర్షం తగ్గలేదు. పక్కసరి చేస్తున్నాను. కొంచెం విశ్రాంతి తీసుకొండి'' అ తను కాదనలేకపోయాడు. భోజనం కొంచెం మోతాదు దాటింది. ఆమె యిచ్చిన చెక్కపోడి నోట్లోవేసుకొని, దుప్పటిసరిగా పరచిన పక్కమీద చేరబడ్డాడు.

ఆమె పనులు చేసుకొని వచ్చి పెరటి వసారాలో నున్న చిన్న మంచం తెచ్చి అతను పడుక్కున్న మంచానికి దగ్గిరగానే వేసుకుంది. పక్కపరుచుకొని తనుకూడా సావకాశంగా నడుం వాల్చింది.

"బయట వర్షం బాగా పడుతోంది. జీపు ఆవరణలో భద్రంగా ఉంటుంది. ఆవరణగేటుకు రాత్రి తాళం వేస్తారు'' అంది ఆవిడ.

"వెళ్లిపోవాలంటే తలుపు తీస్తారా?'' అతను ప్రశ్నించాడు.

"గూర్ఖా ఒకడుంటాడు. అటువంటి అవసరం వస్తే తలుపులు తీయిస్తాను.'' అంది ఆవిడ.

"అంటే?.."

"నేను చెప్పే మాటలు మీకు విసుగనిపిస్తే, నాతో కాలం గడపడం మీకు యిబ్బందిగా ఉంటే అటువంటి ప్రయత్నాలు చెయ్యాలి."

అతనేం మాట్లాడలేదు. ఆలోచిస్తూ పైకి చూస్తున్నాడు.

"ఇక్కడికి ఇరవై అయిదు మైళ్ళ దూరంలో చిత్రకూటముంది. అక్కడ జలపాతమొకటి ఉంది. మీరది చూసారా?" ఆవిడ తిరిగి ప్రారంభించింది.

"లేదు" అన్నాడతను ఆమె వేపు తిరిగి.

"చూడవలసింది. మీరొక్కరూ చూస్తే ఆనందముండదు. మీ ఆవిడను కూడా తీసుకురండి. అక్కడో చిన్న రెస్టుహౌసుంది. అందరూ పగటిపూట కొంతసేపు అక్కడుండి వచ్చేస్తారు. కాని, వెన్నెల రాత్రులలో అక్కడున్న బండరాళ్ల మీద కూర్చొని, జలపాతం చేస్తున్న సవ్వడిలో, మౌనంగా ఒకరి ముఖంలోకి ఒకరు చూచుకుంటూ..."

అతను వింటున్నాడు.

"నలుగురు టీచర్లతో ఏదోపగటిపూట వెళ్లి వచ్చాను. ఆ జలపాతాన్ని ఒక్క వెన్నెల రాత్రుల్లోనే చూడాలని లేదు. ఉభయసంధ్యలు, నడిమధ్యాహ్నాలు, అన్ని ఋతువులు, అన్ని వేళలు. ఆ ప్రకృతి మారుతునే ఉంటుంది. ఎప్పుడూ కొత్తగానే కనిపిస్తుంది. దాన్ని ఆశతో, ఆనందంతో సందర్శించాలనే ఉంటుంది. కాని, ఈ కోరిక అలానే ఉండిపోయింది."

అతనులేచి కూర్చున్నాడు, ఆమె చెప్పింది వినడానికి

ఆమె కూడా మంచం మీద లేచి కూర్చుంది చెప్పడానికి.

"సూర్యోదయంతో అక్కడ తుంపురుల ముసుగు మీద తోచిన ఇంద్రధనస్సు ప్రకృతి తలలోని రత్నాల కిరీటంవలె కనిపిస్తుంది. మండుటెండలో చల్లని ఆపన్నీటిజల్లు చెప్పలేని హాయినిస్తుంది. ఇవన్నీ మనస్సులు కలిసిన ఇద్దరికీ ఆనందాన్ని కలిగిస్తాయి. . కాని ఒంటరి బ్రతుకులకు.."

అతను ఆలోచిస్తున్నాడు.

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఆమె ఆలోచనలలోంచి మేల్కొంది.

"మీరు ఎప్పుడేనా ఎవరినేనా ప్రేమించారా?... మీకు పెళ్లయిందికదా! మీ ఆవిడను ప్రేమించడం సహజమే. ప్రేమంటే తెలియని రోజుల్లో ఎవరినేనా...?"

అతను ఒక్కసారి ఆదిరి పడ్డాడు. ఇటువంటి ప్రశ్నను అతను ఆశించలేదు.

" లోకమంటే తెలియని రోజుల్లో అతనిని ప్రేమించాను. అప్పటికి నాపెళ్లి అయింది. పదిహేనేళ్ల ప్రాయం. మా ఆయన పల్లెటూళ్లో మాస్టరుగా పనిచేసేవారు. అప్పటికి నా కార్యం కాలేదు. మాపెద్దన్నయ్య ఉద్యోగంలో ప్రవేశించాడు. చిన్నన్నయ్య మరో ఊర్లో కాలేజీలో

చదువుకునేవాడు. మేము మరో పల్లెటూళ్లో ఉండేవాళ్లం. భూములు చూసుకుంటూ. ఒకనాడు టెలిగ్రాం వచ్చింది. మా ఆయనకు కఠినంగా ఉందని. ఏమీతోచలేదు మా అమ్మకి. నన్ను వదలలేదు, మానలేదు. పీకలమీదికి వచ్చినప్పుడు ఇన్ని విధాల ఆలోచించడానికి వ్యవధిలేకపోయింది. నేను మా అమ్మ ఆ మధ్యాహ్నమే బస్సులో బయలుదేరాం."

అతను శ్రద్ధగా వింటున్నాడు.

"పాసింజరు బస్సది. తోవలో ఒక ఊరు దగ్గిర అతను ఎక్కారు. అతని కళ్లల్లో ఏవో వెలుగులు. అతని మాటలలో ఏదో ఆకర్షణ. జ్ఞానం వచ్చీరాని రోజులవి. యౌవనం మొగ్గతొడుగుతున్న వేళలవి. ఆయన మాకు పక్కనే ఉన్న సీటులో కూర్చున్నారు. మా అమ్మతో మాట్లాడుతూ మేము వెళ్లవలసి ఊరుగురించి తెలిసి ఆయన ఆందోళన వెలిబుచ్చారు. అడ్డురోడ్డు దగ్గిర ఎవరేనా ఆవూరి వాళ్లుంటేనే సాయంకాలంవేళ వెళ్లమన్నారు. లేకపోతే పక్కనున్న గ్రామంలో రాత్రికి ఉండిపోయి మరునాడు ఉదయం వెళ్లమన్నారు. కాని ఆ సాయంకాలం అడ్డురోడ్డుదగ్గిర తల్లికూతుళ్లమేదిగాం. బస్సు కదిలే ముందు ఆయన కూడా దిగిపోయారు. మారుమూలనున్న మా అత్తవారి ఊరుచేరేసరికి బాగా చీకటిపడింది. ఆయన రాకపోతే మాపని ఏమయేదో? అక్కడ మావారు చావుబ్రతుకుల్లో ఉన్నారు. మరునాడు ప్రొద్దున్నే వెళ్లిపోవలసిన ఆయన మావారి పరిస్థితి చూసి ఉండిపోయారు. ఊళ్లోవాళ్లు వచ్చారు. వైద్యుడు వచ్చాడు. కాని, ఆ రాత్రి ఘోరం జరిగింది. మా ఆయన ఎలా ఉంటారో కూడా నేను సరిగా ఎరుగను. జీవితంలో అడుగుపెట్టకముందే నుదుటివ్రాత వికటిస్తుందని కలలో కూడా అనుకోలేదు.

"నిజం చెప్పాలంటే నాకు ఏడవడం కూడా తెలియదు. ఎప్పుడూ నవ్వుతూ ఆడుతూ పాడుతూ ఉండేదాన్ని. అ వచ్చిన అతను తెలతెలవారే వేళ నాదగ్గిర కూర్చున్నారు. జరిగిన దానికి తీవ్రంగా విచారించవద్దన్నారు, చదువుకోమన్నారు ఉద్యోగం చేసుకోమన్నారు. తాను నన్ను పెళ్లిచేసుకోడానికి అభ్యంతరం లేదన్నారు. మిలిటరీలో చేరుతున్నానని, తిరిగివస్తే తప్పకుండా నన్నే పెళ్లిచేసుకుంటానని చెప్పారు. ఆయన రూపం నా మనసులో, ఆతని మాటలు నా చెవుల్లో నిలిచి జీవితాన్ని ఒకదారికి తెచ్చాయి. అమ్మమాట వినకుండా అన్నయ్యలు వద్దన్నా మానకుండా, ఒకరికి బరువుకారాదని నిశ్చయానికి వచ్చి చదువు కున్నాను. దేశంలో ఎక్కడో ఉద్యోగం దొరికినా వద్దనకుండా ముందుకు అడుగువేశాను."

నిశ్శబ్దం అంతటా ఆవరించుకుంది. పక్కనున్న కిటికీ తలుపులు తెరిచాడు మూర్తి. వర్షం పడడంలేదు. మబ్బులు తొలగి అక్కడక్కడ నక్షత్రాలు కనిపిస్తున్నాయి. ఆవిడకళ్లల్లోకి చూడాలని, ఆవిడ చెంపలమీద జారుతున్న కన్నీళ్లను తుడవాలని అతననుకున్నాడు. కాని, అతనికాధైర్యంలేదు. చాలసేపటివరకు ఆలోచిస్తూ అలా మేఘాలవంక చూస్తూ ఉండిపోయాడు. తరువాత తిరిగి చూస్తే ఆమె పక్కమీద పడుక్కొంది. గాఢమైన నిద్రలో ఉంది. ఏదో మధురమైన నిద్రలో విహరిస్తున్నది. కాంతివంతంగా వెలుగుతున్న దీపం ఆర్పేముందు

సాకాంక్షగా ఆమె ముఖంలోకి చాలసేపు చూశాడు. ఆమె ముంగురులు గాలికి ఎగురుతున్నాయి. తన మీద సంపూర్ణమైన విశ్వాసముంచి ఆమె నిశ్చింతగా నిద్రపోతున్నది.

మూర్తికి తెలివి వచ్చేసరికి బాగా వెలుగు వచ్చింది. పైన ఎండ ముమ్మరంగా ఉంది. బద్ధకంగా లేచి టేబిలు మీదనున్న చేతివాచీ చూసుకున్నాడు. తొమ్మిది గంటలయింది. ఇంట్లో చూస్తే మాలతి కనిపించలేదు. స్కూలుకి వెళ్లిపోయింది. బ్రష్ నోట్లోపెట్టుకొని అతను టేబిలు దగ్గిరకోసారి వచ్చాడు. జాగ్రత్తగా మడిచిన కాగితమొకటి కనిపించింది. విప్పిచూస్తే ఇలా ఉంది.

"మిమ్మల్ని ఏమని సంబోధించాలో నాకు తెలియదు. నేను బడికి బయలు దేరేవరకు మీరు నిద్రలేవలేదు. అందుచేత ఈ ఉత్తరం వ్రాయవలసి వచ్చింది. రాత్రి చాలవరకు నా సొద చెప్పి మిమ్మల్ని బాధపెట్టాను. క్షమించండి. మీ వంతు నావంతు నేనే మాట్లాడి మిమ్మల్ని విసిగించాను. సావకాశంగా మీరు స్నానం అవి ముగించి మరీ వెళ్లండి. ఫ్లాస్కులో కాఫీ ఉంది. పక్కనే ఉన్న కారియర్‌లో టిఫిన్ పెట్టాను.

ఈ ఉత్తరం వ్రాయడానికి మరో ప్రబలమైన కారణం ఉంది. వ్యక్తిగతంగా మీరెవరో నాకు తెలియదు. నేనెవరో మీకు తెలియదు. కాని, మనిద్దరం, అంటే వయసులో నున్న పురుషుడు, పరువంలో నున్న యువతి, వర్షంకురిసే రాత్రి ఒకే పంచలో గడిపితే లోకమేమనుకుంటుంది?

మా టీచర్లందరూ నాపౌరుషాన్ని రెచ్చగొట్టి నన్ని పందెంలోకి తోశారు. నేను ఓడిపోక తప్పదన్నారు. ముల్లు ఆకుమీద పడినా, ఆకు ముల్లుమీద పడినా చిరగడం తప్పదన్నారు. నేను గెలవలేనన్నారు.

ఏదో పట్టుదల నాలో తలెత్తింది. విజయం సాధించాలనే నిర్ణయానికి వచ్చాను. అందుకోసం మధ్యాహ్నమంతా బాగా ఆలోచించాను. మీరు మర్యాదస్తులుగా మొదటి చూపులోనే కనిపించారు. సంస్కారమున్న వారికి హృదయమున్నదనే నమ్మకం.

మీలో నున్న జాలిని కదిపేముందు మీలోగల పత్నీ ప్రేమను పదును పరచాను. తరువాత దుఃఖ కథను చెప్పాను. క్షమించండి. నేనంతా కల్పించాను. ఎవరో యువకుడు బస్సులో కలిసిన మాటవాస్తవమే. అతను నాతో ఒక్క మాటకూడా ఆడలేదు. అతనిలోని మంచి గుణాలు ఊహించుకుని, అతను నాకు చెప్పాడని అనుకొని వాటిచే నా జీవితం దిద్దించుకున్నాను.

ఇది కేవలం భ్రమ. పడరాని అగచాట్లు పడి ఈస్థితికి చేరుకున్నాను. నేను కార్చిన కన్నీరు నాప్రేమోదంతం తలచుకొని కుమలగా వచ్చినదికాదు. చిన్న పిల్లడిలా నామాట వింటూ నా దుఃఖంలో పాలు పంచుకుంటున్న మీతో, పందెం గెలవాలనే పట్టుదలతో, పచ్చి అబద్ధాలు చెప్తున్నందుకు ఏడ్చాను.

మీరు మంచివాళ్లు. హృదయమున్నవాళ్లు. పొద్దున్నే సూర్యకాంతులు మీ ముఖం మీద పడుతుంటే చూసి నమస్కారం చేయకుండా ఉండలేకపోయాను. క్షమించండి.

ఈ విషయాలన్నిటికోసం ఉత్తరం వ్రాయడంలేదు. మిమ్మల్ని ఆరాధించే యిల్లాలు జ్ఞాపకం వచ్చారు. మనిద్దరం ఒకే పంచలో గడిపిన రాత్రికి లోకం మరోవిధంగా వ్యాఖ్యానం చేస్తుంది. నా మాటలెవరూ నమ్మరు. నేను గెలిచానంటే విరగబడి నవ్వుతారు.

ఈ విషయం మీ ఆవిడకు తెలియక మానదు. మంచికన్న చెడ్డను నమ్మడం స్త్రీ స్వభావం. కాని, ఆవిడకు ఈ ఉత్తరం చూపించండి. లోకం దృష్టిలో నేను ఓడిపోయినా ఆవిడకు అన్యాయం చెయ్యలేదని చెప్పండి. ఆదొక్కటే నాకోరిక.''

చివరి పంక్తులలోని అక్షరాలు చెరిగిపోయాయి. కన్నీళ్లుపడి ఆవిడ మనసులాగనే అవి కలతజెందాయి.

వీధి తలుపు తోసుకొని జీపుడ్రైవరు గదిలోకి వచ్చి నమస్కారం చేశాడు మూర్తికి.

మూర్తి తొందరగా ముఖం కడుక్కొని టేబిలుమీదనున్న కాగితమొకటి తీసుకొని ఉత్తరం వ్రాశాడు.

"నాకు కూడా మిమ్మల్ని ఎలా సంబోధించాలో తెలియదు. మీరు పందెంలో ఓడిపోలేదు. కాని, మీకు మల్లే నేను కూడా ఒంటరి  నని  తెలిస్తే పందెం గెలిచేవారా?

వెంటనే బయలు దేరి రండి.

సప్తపదివరకు నాతో నడిచి, ఇపుడు వెళ్లిపోతే ఎలా?

స్నానం చేసి మీకోసం ఎదురుచూస్తుంటాను.

కోటలోనున్న దాంతేశ్వరీ ఆలయానికి పోదాం. అక్కడ పూలదండలుంటాయి. ఆదేవి సమక్షంలో వివాహమంగళం సంపన్నమవుతుంది.

తరువాత చిత్రకూటం...

మీ.''

ఉత్తరం డ్రైవరు చేతికిచ్చి మూర్తి అన్నాడు.

"ధర్మారావూ! వెంటనే జీపుతీసుకెళ్లి, మాలతీ టీచరుగారికి ఈ ఉత్తరం ఇచ్చి, వారిని వెంటనే తీసుకురా".

" టీచరమ్మగారినా, సార్!"

"అవును కాబోయే మీ అమ్మగారిని" అన్నాడు మూర్తి సాధికారంగా.

(రంజని - ప్రత్యేక సంచిక)

☆